సాక్షి
ములుగు


జంపన్న వాగులో షవర్ల వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు


తల్లుల దర్శనానికి..

సోమవారం । 29 । జనవరి । 2024


మేడారంలోని వనదేవతల గద్దెల వద్ద కిక్కిరిసిన భక్తజనం

ముందస్తు మొక్కులు

- వివరాలు 8లో ▸

మేడారానికి పోటెత్తిన భక్తులు

మేడారం మహాజాతర ప్రారంభానికి ఇంకా మూడు వారాలపైన సమయం ఉంది. ఇప్పటి నుంచే భక్తులు వేల సంఖ్యలో వన దేవతల దర్శనానికి తరలివెళ్లి ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రైవేట్ వాహనాల్లో భారీగా వచ్చారు. రాత్రి 7 గంటల వరకు కూడా భక్తుల రాక కొనసాగడంతో అమ్మవార్ల గద్దెల వద్ద రద్దీ పెరిగింది. సుమారు 5లక్షల మంది దర్శనానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. - ఎస్ఎస్‌తాడ్వాయి

న్యూస్‌రీల్

నేడు మంత్రి పర్యటన

కాటారం: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం కాటారం మండలంలో పర్యటించనున్నారు. మండలంలోని వీరాపూర్‌లో గ్రామపంచాయతీ భవనాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. ప్రారంభానికి సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వీరాపూర్ సర్పంచ్ వేమునూరి రమేశ్‌రెడ్డి తెలిపారు.

ఇసుక లారీల తనిఖీ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం లోని పూస్కుపల్లి వద్ద ఇసుక లోడుతో వస్తున్న లారీలను నిలిపి టీఎస్ఎండీసీ పీఓ తారక్‌నాథ్ రెడ్డి తనిఖీ చేశారు. ఆదివారం ఇసుక క్వారీల గుండా లారీలు వస్తుండగా ఉన్నతాధికారుల ఆదేశాలతో పీఓ నిలిపి పత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా అధిక లోడుతో వెళ్లవద్దని, నిబంధనలు అతిక్రమించద్దని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట టీఎస్ఎండీసీ సిబ్బంది ఉన్నారు.

సంతకాల సేకరణ



భూపాలపల్లి అర్బన్: ఫిబ్రవరి 16వ జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బందు సాయిలు మాట్లాడుతూ సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సమైక్య, కేవీపీఎస్, ఆదివాసీ గిరిజన సంఘం, భారత ప్రజాతంత్ర యువజన సమైక్య, ఎస్ఎఫ్ఐ, ఎన్‌పీఆర్‌డీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమ్మె చేపడుతున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజయ్య, రమేష్, రవికుమార్, శ్రీధర్, వెంకటేష్, మధుకర్, మహేష్, సారయ్య, శ్రీధర్, సురేష్ పాల్గొన్నారు.

విగ్రహం తొలగింపుపై ఆగ్రహం



కాళేశ్వరం: కాళేశ్వరం లోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయం శ్రీమహాసరస్వతి ఆలయం సమీపంలోని పురాతన సరస్వతి అమ్మవారి విగ్రహాన్ని ఆలయ అధికారులు తొలగించడంపై విమర్శలు వస్తున్నాయి. కాళేశ్వరాలయం 1976–82 మధ్యలో జరిగిన జీర్ణోద్ధరణ సమయంలో అమ్మవారి విగ్రహాన్ని తీసి ఆలయంలో నూతన శ్రీమహాసరస్వతి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠ చేశారు. వేపచెట్టు వద్ద గద్దెపై ఉన్న పురాతన విగ్రహానికి కొన్నేళ్లుగా మహిళలు, భక్తులు కొలుస్తున్నారు. ఆలయ అధికారులు రెండు రోజుల క్రితం పురాతన విగ్రహాన్ని తొలగించి ఆలయం వెనుకాల గోడకు అంటిపెట్టారు. అమ్మవారి విగ్రహం కనిపించకపోవడంతో మహిళా భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కంకర తిప్పలు



టేకుమట్ల: టేకుమట్ల–అంకుషాపూర్ ప్రధాన రోడ్డు పక్కన అంకుషాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి డంప్ చేసిన కంకర వాహనదారులకు తిప్పలు తెచ్చి పెడుతుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రధాన రోడ్డు పక్కన డంప్ చేశారు. సీసీ రోడ్డు పనులు మొదలు కాకపోవడంతో సుమారు నెల రోజుల నుంచి వాహనాల రాకపోకలతో కంకర రోడ్డు మధ్యకు చేరుకుంది. రాత్రి ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్నారు. ఇటీవల రాత్రి ద్విచక్ర వాహనంపై నుంచి ఓవ్యక్తి పడి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్ స్పందించి రోడ్డు పక్కన పోసిన కంకరను మరో చోటుకు తరలించాలని పలువురు కోరుతున్నారు.



భయం భయంగా..

- మితిమీరిన వేగంతో ఇసుక లారీలు
- రాత్రి, పగలు తేడా లేకుండా వందల సంఖ్యలో రాకపోకలు
- రోడ్డుపై వెళ్లాలంటేనే జంకుతున్న ప్రజలు

మంగపేట: మండలంలోని ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై నుంచి వరంగల్, హైదరబాద్ తదితర ప్రాంతాలకు ఇసుక రవాణా చేస్తున్న లారీల వేగానికి ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక భయం భయంగా రోడ్డుపై వెళ్తున్న పరిస్థితులు ఉన్నాయి. మండల కేంద్రానికి పొరుగున ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల పరిధిలోని సాంబాయిగూడెం, పినపాక మండలంలోని దుగినేపల్లి పంచాయతీ పరిధిలోని వీరాపురం ఇసుక క్వారీల నుంచి నిత్యం వందల సంఖ్యలో ఇసుక లారీలు పగలు రాత్రి తేడా లేకుండా మండలం నుంచి ఇసుక లోడుతో వెళ్తున్నాయి. సామర్థ్యానికి మించి ఇసుక లోడుతో వెళ్తున్న లారీలను డ్రైవర్లు మితిమీరిన వేగంతో నడుపుతూ భరించలేని హారన్లు మోగిస్తూ దూసుకుపోతున్నారు. దీంతో ఇసుక లారీల వేగానికి ఎదురుగా వచ్చే వాహన చోదకులు, రోడ్డు వెంట నడిచి వెళ్లే పాదచారులు సైతం రోడ్డు కిందకు పరుగుతీయాల్సిన పరిస్థితి నెలకొంది.

రోడ్డు దాటాలంటే సాహసం..

మండల పరిధిలోని ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రహదారిని దాటేందుకు ప్రజలు సాహసం చేస్తున్నారు. బ్రాహ్మణపల్లి నుంచి కమలాపురం వరకు గల 13 గ్రామాల మధ్య నుంచి ప్రధాన రోడ్డు ఉండటంతో నిత్యం ఆయా గ్రామాల ప్రజలు వివిధ రకాల పనులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చే కూలీలు ఇసుక లారీల వేగానికి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రోడ్డు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డుకు దగ్గరగా ఇళ్లు ఉన్న జనావాసాల ప్రజలు పిల్లలు ఇంటి నుంచి బయటకు రాకుండా కాపలా ఉండాల్సి వస్తోంది.


రాజుపేట ప్రధాన సెంటర్ వద్ద వేగంగా వెళ్తున్న ఇసుక లారీలు


మల్లూరు వద్ద ఇసుక లారీలతో నిలిచిపోయిన ట్రాఫిక్

రోడ్డుకు ఇరువైపులా..

గ్రామాల మధ్య నుంచి ప్రధాన రోడ్డు ఉండటం, రోడ్డుకు ఇరువైపులా జనావాసాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పీహెచ్‌సీలు ఉన్నాయి. దీంతో ప్రజలు నిత్యం రోడ్డు దాటుతున్నా ఇసుక లారీల డ్రైవర్లు మితిమీరిన వేగంతో వెళ్తుండడంతో ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. అదే విధంగా ఇసుక లారీల వల్ల మరింత ఇబ్బందులు ఎదురైతే ప్రధాన రోడ్డు వెంట ఉన్న గ్రామాల ప్రజలు రోడ్లపైకి వచ్చి ఇసుక లారీలను నిలిపి వేసేందుకు సిద్ధమవుతున్నారు.

రోడ్డుపై బారికేడ్లు ఏర్పాటు చేయాలి

అనునిత్యం హనుమకొండ నుంచి మంగపేట మీదుగా భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్టణం వంటి ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. అదేవిధంగా ప్రస్తుతం మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు ఆయా ప్రాంతాల నుంచి వచ్చి పోయే భక్తుల వాహనాల రద్దీ మరింత పెరిగింది. ఈ క్రమంలోనే ఇసుక లారీల వేగంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

వాహనంపై వెళ్లాలంటే భయంగా ఉంది..



ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై ద్విచక్ర వాహనంపై ప్రయాణించడం సాహసోపేతంగా మారింది. వృత్తిరీత్యా రాజుపేట నుంచి మల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహించేందుకు నిత్యం 10 కిలోమీటర్ల దూరం వెళ్లి రావాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఇసుక లారీలు అతి వేగంగా ఎదురుగా వస్తున్నాయి. పలుచోట్ల లారీని మరో లారీ ఓవర్ టేక్ చేసే క్రమంలో బైక్‌పై వెళ్లే తాను ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి. దీంతో నిత్యం విధులకు వెళ్లి రావడం సాహసం చేస్తున్నట్లుగా ఉంది.

- చందా భద్రయ్య, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, మల్లూరు

వనదేవతలను సులభంగా దర్శించుకునేలా చర్యలు

ఎస్ఎస్‌తాడ్వాయి: సమ్మక్క– సారలమ్మలను భక్తులు సులభంగా దర్శించుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ శబరీశ్ తెలిపారు. మేడారంలో ఆయన ఆదివారం పర్యటించారు. లక్షలాది మంది భక్తులు అమ్మవార్ల జాతరకు రానునందున్న గద్దెలకు సమీప దూరంలోకి భక్తుల వాహనాలు వచ్చేలా మరిన్ని నూతన పార్కింగ్ స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. భక్తులు ఇబ్బందులు పడకుండా గద్దెల సమీపంలోకి చేర్చేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. దానికి అనుగుణంగా ట్రాఫిక్ మళ్లింపు చేశామని భక్తులు సహకరించాలన్నారు. వాహనాల తాకిడిని దృష్టిలో పెట్టుకుని పస్రా నుంచి తాడ్వాయి మీదుగా మేడారానికి వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ ఆంక్షలు విధించడం జరిగిందన్నారు. వాహనాలను ఓవర్ టేక్ చేయవద్దని, రోడ్డుకు ఇరువైపులా ఎట్టి పరిస్థితుల్లో వాహనాలను నిలుపరాదని తెలిపారు. వారికి కేటాయించిన స్థలాలలో మాత్రమే పార్కింగ్ చేయాలని సూచించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో దర్శనం చేసుకునేలా అన్ని చర్యలు చేపట్టామని అందుకు భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

భక్తులకు సురక్షితమైన తాగునీరు

ఏటూరునాగారం: మేడారం జాతరకు వచ్చే భక్తులకు సురక్షితమైన తాగునీరు అందించడానికి మిషన్ భగీరథ ద్వారా వస్తున్న నీటిని, ఇతర ప్రభుత్వ తాగునీటి సరఫరా ట్యాంకుల నుంచి వచ్చే నీటిని రీజనల్ హెల్త్ ల్యాబొరేటరీ అధికారులు ఆదివారం పరీక్షించారు. తాడ్వాయి, ఏటూరునాగారం, వాజేడు, మంగపేట, తదితర ప్రాంతాల్లో తాగునీటి నమూనాలను సేకరించారు. ఫిబ్రవరిలో జరిగే మేడారం జాతరకు వచ్చే భక్తులకు రోడ్డు వెంట ఉన్న కులాయిలు, ఇతర వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని అందించనున్నారు. ఇందు కోసం వారు తాగేనీరు సురక్షితమైందా కాదా అని పరీక్షలు చేపట్టారు. తాగునీటిలో ఏదైనా సమస్యలు ఉంటే వాటిని విశ్లేషించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని రీజనల్ హెల్త్ పబ్లిక్ ల్యాబొరేటరీ సివిల్ సర్జన్, బ్యాక్టీరియాలోజిస్ట్ డాక్టర్ శ్రీకృష్ణారావు తెలిపారు. తాగునీటిలో లోపాలను గుర్తించి భక్తులకు సురక్షితమైన నీరు అందేలా తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, శాంపిల్ టేకర్స్ శేఖర్, సలావుద్దీన్ పాల్గొన్నారు.


తాళ్లగడ్డలో నీటి నమూనాలను సేకరిస్తున్న శ్రీకృష్ణారావు

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

మొగుళ్లపల్లి: వచ్చే ఆర్థిక సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా జీపీల్లో చేపట్టనున్న అభివృద్ధిపై అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జాతీయస్థాయి ప్రజాప్రణాళిక కార్యక్రమం కింద ప్రణాళికలు రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో ఈనెల 7నుంచి జిల్లావ్యాప్తంగా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. 31వరకు గ్రామసభలు పూర్తి చేసి ఈ–గ్రామస్వరాజ్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయనున్నారు. ప్రస్తుత అభివృద్ధి ప్రణాళికలో ప్రభుత్వం తొమ్మిది అంశాలను ప్రవేశపెట్టింది. వీటిలో రెండు అంశాలను తీసుకుని ప్రత్యేకంగా బడ్జెట్ రూపొందించుకోవాలి.

హేమాచలక్షేత్రంలో భక్తుల సందడి


మంగపేట: మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఆదివారం వేలాది మంది భక్తజనంతో కిక్కిరిసింది. ఆలయంలోని స్వయంభు స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వేలసంఖ్యలో తరలివచ్చారు. మేడారం సమ్మక్క–సారలమ్మ వనదేవతలను దర్శించుకున్న భక్తులు సైతం హేమాచలున్ని దర్శించుకునేందుకు ఆలయానికి వస్తుండడంతో ఆలయ పరిసరాల్లో భక్తజన సందడి నెలకొంది. ఉదయాన్నే గుట్టపైకి చేరుకున్న భక్తులు ఆలయ సమీపంలోని పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి హేమాచల కొండపై ఉన్న ఆలయాన్ని చేరుకున్నారు. ఆలయ అర్చకులు రాజశేఖర్‌శర్మ, కారంపుడి పవన్‌కుమార్, ఆచార్యులు ఈశ్వర రామానుజ దాస్ స్వామివారికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నువ్వుల నూనెతో తిల తైలాభిషేకం, ప్రత్యేక అర్చనలు జరిపించి నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొని మానవ శరీరంతో పోలి ఉండే స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని భక్తులు పులకించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ పూజారులు గోత్రనామాలతో ప్రత్యేక అర్చనలు జరిపించి స్వామివారి చరిత్ర, ఆలయ పురాణం వివరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. సంతానం కోసం వచ్చిన దంపతులకు స్వామివారి నాభిచందన ప్రసాదాన్ని అందజేశారు.


హేమాచల లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

తునికాకు టెండర్లను వెంటనే పూర్తి చేయాలి

- 50 ఆకుల కట్టకు రూ.4 చెల్లించాలి
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవికుమార్

గోవిందరావుపేట: తునికాకు టెండర్ల ప్రక్రియను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయడంతో పాటుగా 50ఆకుల కట్టకు రూ.4 చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ కోరారు. మండల పరిధిలోని పస్రాలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం రత్నం రాజేందర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలో వేసవిలో తునికాకు సేకరణ గిరిజనులకు రెండో పంటగా ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో తునికాకు టెండర్ల ప్రక్రియను అటవీశాఖ అధికారులు ఇప్పటి వరకు పూర్తిచేయలేదన్నారు. వెంటనే అటవీశాఖ అధికారులు తునికాకు టెండర్లను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా 2016 నుంచి 2021 వరకు తునికాకు బోనస్ 200 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం గతంలో విడుదల చేసినా ఇంతవరకు కూలీలకు అందలేదన్నారు. అందిన కొందరికి రెండు సంవత్సరాలు బోనస్ మాత్రమే బ్యాంక్‌లో జమ అయిందని వివరించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి మిగితా జమ కాని బోనస్ డబ్బులను కూలీలకు మేడారం జాతర లోపు వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని బండారు రవికుమార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు భీరెడ్డి సాంబశివ, రత్నం రాజేందర్, ఎండీ అంజద్, జిల్లా కమిటీ సభ్యులు వంక రాములు, గొంది రాజేష్, పొదిల్ల చిట్టిబాబు, పేదం రమాదేవి, ఎండీ గఫూర్ పాషా, దుగ్గి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

గ్రామాల అభివృద్ధికి పాటుపడుతాం..

- పంచాయతీరాజ్, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క

ములుగు రూరల్: రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు మండల పరిధిలోని గుర్తూరుతండా, ఇంచర్ల, కాశిందేవిపేట గ్రామాలలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాలను మంత్రి ఆదివారం ప్రారంభించారు. గుర్తూరుతండా గ్రామానికి వచ్చిన మంత్రి సీతక్కకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలన్నారు. ఇప్పటి వరకు అభివృద్ధికి నోచుకోని మారుమూల గ్రామాలకు నిధులను మంజూరు చేసి అభివృద్ధి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. నిరుపేదలను గుర్తించి రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని వివరించారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణంతో పాటు రూ.10లక్షల ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తున్నామన్నారు. మిగతా నాలుగు గ్యారంటీలను త్వరలోనే అమలు చేస్తామని వివరించారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని తెలిపారు.

పదేళ్లలో రాష్ట్రాన్ని లూటీ చేశారు..

తెలంగాణ రాష్ట్రం విభజన సమయంలో మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని గత పాలకులు లూటీ చేశారని మంత్రి సీతక్క ఆరోపించారు. ధనిక రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని విమర్శించారు. రాష్ట్రంలో నిరుపేదలకు మాత్రం ఒక్క ఇల్లు కూడా కట్టించి ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల పాలనలో ప్రజాధనం దుర్వినియోగం చేసిందన్నారు. ప్రజలకు ఏమాత్రం మేలు జరగలేదన్నారు.

రెండు పంటలకు నీరు

ములుగు మండలంలోని ఏజెన్సీ గ్రామాలు లోతట్టు ప్రాంతాలని తెలిపారు. ఏజెన్సీ గ్రామాలలో రెండు పంటలకు సాగు నీరు అందిస్తామన్నారు. అదే విధంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారిస్తానని వివరించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు నిబద్ధతతో ప్రజలకు పాలన అందించాలన్నారు. కార్యక్రమానికి ముందుగా వేదికపై ఏర్పాటు చేసిన తుడుందెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు దబ్బకట్ల నర్సింగరావు చిత్ర పటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన సన్మాన సభలో మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ(స్థానిక సంస్థలు), సీఈఓ ప్రసూన రాణి, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య, డీపీఓ వెంకయ్య, లోతట్టు గ్రామాల సర్పంచ్‌లు అల్లెం సదానందం, పీడబోయిన స్వామి, దబ్బకట్ల విజయ, శాంతమ్మ, ఐద్దుల లక్ష్మీ, సోమ పారిజాతం, కాశిందేవిపేట సర్పంచ్ అహ్మద్‌పాషా, మంకిడి రవి, ఈక కృష్ణ, ముంజాల భిక్షపతిగౌడ్, గుండబోయిన రవిగౌడ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేటలో..

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రూ.14లక్షలతో నిర్మించిన జనన నిరీక్షణ గది, దుంపెల్లిగూడెంలో రూ.16.85లక్షలతో నిర్మించిన జీపీ కార్యాలయం, చల్వాయిలో నిర్మించిన కిచెన్ షెడ్డును ఆదివారం మంత్రి సీతక్క ఐటీడీఏ పీఓ అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వైద్యాధికారులు అందుబాటులో ఉంటూ ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. జనన నిరీక్షణ గది గర్భిణులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం మంత్రికి పీహెచ్‌సీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైద్యాధికారి చంద్రకాత్ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, సీఈఓ ప్రసూన రాణి, ఐటీడీఏ ఈఈ హేమలత, తహసీల్దార్ సృజన్ కుమార్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు అశోక్, చల్వాయి సర్పంచ్ ఈసం సమ్మయ్య, ఉప సర్పంచ్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రాయినిగూడెం సభలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క


చల్వాయిలో కిచెన్ షెడ్డును ప్రారంభిస్తున్న సీతక్క

అట్టహాసంగా గొంతెమ్మ గుట్ట జాతర

కాటారం: మండలంలోని ప్రతాపగిరి గొంతెమ్మ గుట్టపై జాతర అట్టహాసంగా కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన జాతర ఆదివారం వైభోపేతంగా జరిగింది. పాండవుల భేరి వద్ద పట్నాలు వేసి లక్ష్మీదేవరకు ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి వచ్చిన లక్ష్మీదేవర బృందాలు ఆడిపాడాయి. శివసత్తులు పూనకాలతో ఊగిపోగా భక్తులు బోనాలు వండి మొక్కులు సమర్పించారు. గుట్టపై శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. గుట్టపై దేవతామూర్తుల ఆనవాళ్లను దర్శించుకొని భక్తులు భక్తి పారవశ్యంతో పరవశించిపోయారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో ఇతర పారంతాల నుంచి భక్తుల రాకతో గుట్ట ప్రాంతం కిటకిటలాడింది.


శివలింగం దగ్గర పూజలు చేస్తున్న భక్తులు

మేడారం.. జనసంద్రం





మొక్కుతున్న భక్తురాలు



కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకుంటున్న పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి



మొక్కుతున్న భక్తురాలు

భక్తుల రద్దీతో హోరెత్తిన జాతర

- తల్లులను దర్శించుకున్న లక్షలాది మంది
- ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు పకడ్బందీ చర్యలు

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మేడారం..జనసంద్రమైంది. ఎటూ చూసినా భక్తజనసందోహమే. ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక పరిమళమే. ఆదివారం సెలవు రోజు కావడంతో మేడారం సమ్మక్క- సారలమ్మలను దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా జంపన్నవాగు స్నానఘట్టాల వద్ద షవర్ల కింద పుణ్యస్నానాలు ఆచరించారు. పుట్టు వెంట్రుకలు సమర్పించుకున్నారు. అనంతరం అమ్మవార్ల గద్దెలకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీతో గద్దెల ప్రాంగణం హోరెత్తింది. గంటల శబ్దాలతో గద్దెల ప్రాంగణం మార్మోగింది. లక్షల సంఖ్యలో భక్తుల తాకిడి పెరగడంతో అధికారులు రెండు క్యూలైన్ల ద్వారా దర్శనానికి పంపించారు. గద్దెల ప్రాంగణంలో రద్దీ నియంత్రణకు ఎస్పీ శబరీశ్ పర్యవేక్షణలో సిబ్బంది పకడ్బందీ చర్యలు చేపట్టారు. సుమారు 5 లక్షల మందికిపైకి భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకున్నారు. రాత్రి 7 గంటలకు వరకు కూడా భక్తులు మేడారానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

వనంలో భక్తుల సందడి

మేడారానికి భక్తులు లక్షల సంఖ్యలో తరలిరావడంతో వనమంత జన సందడిగా మారింది. ఆదివారం తెల్లవారుజాము నుంచి మేడారానికి భక్తుల రాక మొదలైంది. రోడ్ల వెంట వేలాది వాహనాలు బారులు దీరాయి. జంపన్నవాగు నుంచి భక్తులు గద్దెల వరకు కాలినడక వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు పది కిలోమీటర్ల దూరంలో భక్తులు అడవిలో విడిది చేసి వంటావార్పు చేసుకున్నారు.

ట్రాఫిక్ జామ్- నియంత్రణ చర్యలు

మేడారానికి భక్తుల రద్దీ ఊహించని విధంగా లక్షల సంఖ్యలో పెరగడంతో వాహనాలతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది, ఎస్పీ శబరీశ్.. పోలీసు అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి వాహనాల ట్రాఫిక్ జామ్‌ను నియంత్రించారు. నార్లాపూర్ నుంచి ఉదయం వరకు మేడారానికి భక్తుల వాహనాలను అనుమతించారు. పస్రా నుంచి మేడారం మార్గంలో రోడ్డు మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు హనుమకొండ నుంచి వచ్చిన భక్తుల వాహనాలను పస్రా నుంచి తాడ్వాయి మీదుగా మేడారానికి మళ్లించారు. తాడ్వాయి- మేడారం మార్గంలో ఆరు కిలోమీటర్ల దూరం వరకు కొద్ది సేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో పోలీసులు అప్రమత్తమై క్లియర్ చేశారు. తాడ్వాయి మీదుగా వచ్చిన వావాహనాలను శివరాంసాగర్ చెరువు సమీపంలోని వీఐపీ పార్కింగ్ ప్రదేశాల్లోకి మళ్లించారు. నార్లాపూర్ నుంచి వచ్చిన వాహనాలను గద్దెల ఊరట్టం స్తూపం, గద్దెల సమీపంలోని పార్కింగ్ స్థలాలకు మళ్లించారు.

మేడారంలో సెల్‌ఫోన్ సిగ్నల్‌కు అంతరాయం..

మేడారంలో సిగ్నల్ అంతరాయంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. జియో, ఎయిర్‌టెల్, బీఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్‌ల సిగ్నళ్లు పని చేయడం లేదు. ఫలితంగా సమాచారం లోపంతో భక్తులు ఇబ్బందులు పడ్సాలి వస్తుంది. ప్రతి బుధ, గురు, శుక్ర, ఆదివారాల్లో భక్తుల రద్దీ పెరగడంతో సెల్ సిగ్నల్ సక్రమంగా రాకపోవడంతో బయట వ్యక్తులు ఫోన్ చేస్తే వినిపించడం లేదు. అంతేకాకుండా సిగ్నల్ లేకపోవడంతో నెట్ కూడా పని చేయడం లేదు. చాలా మంది భక్తులు ఫోన్‌పే, గూగుల్ పై మేడారంలో కొబ్బరి, బెల్లం, వస్తువులు కొనుగులు చేసి చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయం లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. జాతరకు 24 రోజుల ముందే సిగ్నల్ అంతరాయం ఏర్పడితే మహాజాతర నాలుగు రోజుల సమయంలో పరిస్థితి ఏమిటిని భక్తులు ప్రశ్నిస్తున్నారు. సెల్ సిగ్నల్, నెట్ వర్క్ పెంచేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



గద్దెల వద్ద బంగారం (బెల్లం) కోసం ఎగబడుతున్న భక్తులు



భక్తులు సమర్పించిన బంగారం (బెల్లం)



ప్రైవేట్ వాహనాలతో నిండిన జాతర పరిసరాలు



వాహనాల ట్రాఫిక్ జామ్

క్లుప్తంగా

గట్టమ్మకు హైకోర్టు న్యాయమూర్తి మొక్కులు



గట్టమ్మను దర్శించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి రాజేశ్వర్‌రావు

ములుగు రూరల్ : మండలంలోని జాకారం పంచాయతీ పరిధిలోని గట్టమ్మ తల్లిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి నామవరపు రాజేశ్వర్‌రావు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించారు. న్యాయమూర్తికి పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్తూ మార్గమధ్యలోని గట్టమ్మ దేవాలయంలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు నిర్వహించారు. కాగా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరిష్.. న్యాయమూర్తికి గట్టమ్మ ఆలయం వద్ద స్వాగతం పలికారు. కార్యక్రమంలో ములుగు జిల్లా న్యాయమూర్తులు పాల్గొన్నారు.

'ట్రెంగ' రాష్ట్ర అధ్యక్షుడిగా రవి



కొండమల్ల రవి

కాళోజీ సెంటర్ : తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ) రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా వరంగల్ జిల్లాకు చెందిన కొండమల్ల రవిని ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాష్ట్రంలోని రెవెన్యూ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానన్నారు. తనను రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీంగా ఎన్నుకున్న ఉద్యోగులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

తాత్కాలిక రైళ్ల హాల్టింగ్ ఎత్తివేత



కాజీపేట రూరల్ : కాజీపేట సబ్‌డివిజన్ పరిధిలోని హసన్‌పర్తి రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లకు తాత్కాలికంగా హాల్టింగ్‌ను ఎత్తివేసినట్లు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. మూడో రైల్వే లైన్‌తో పాటు పలు అభివృద్ధి పనుల వల్ల రైళ్లకు హాల్టింగ్‌ను ఎత్తివేసినట్లు తెలిపారు.

హాల్టింగ్ ఎత్తివేసిన రైళ్లు ఇవే..

ఈ నెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు అప్‌లైన్‌లో కాజీపేట-సిర్పూర్‌కాగజ్‌నగర్ (17003) వెళ్లే రామగిరి, భద్రాచలంరోడ్-సిర్పూర్‌కాగజ్‌నగర్ (17033) సింగరేణి, సికింద్రాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్ (17233) భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్‌ను ఎత్తివేశారు.అలాగే డౌన్ రూట్‌లో వెళ్లాల్సిన కాజీపేట-సికింద్రాబాద్ (17234) భాగ్యనగర్, సిర్పూర్‌కాగజ్‌నగర్-భద్రాచలం రోడ్ (17034) సింగరేణి, బల్లార్షా-కాజీపేట (17004) సింగరేణి ప్యాసింజర్ రైళ్లను ఫిబ్రవరి 9వ తేదీ వరకు తాత్కాలిక హాల్టింగ్‌లను ఎత్తివేసినట్లు అధికారులు తెలిపారు.

ఎండు గంజాయి స్వాధీనం

- ఒడిశా నుంచి ముంబాయికి సరఫరా చేస్తూ పట్టుబడ్డ నిందితుడు



నిందితుడితోపాటు పట్టుబడిన గంజాయి చూపుతున్న ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వే స్టేషన్‌లోని మూడో ఫ్లాట్‌ఫారం వైపు శివనగర్ ఆటో స్టాండ్ వద్ద ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు ఒడిశా నుంచి రైళ్లో విశాఖపట్నం, వరంగల్ మీదుగా ముంబాయికి గంజాయి తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. వరంగల్ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఆదేశాల ఈమేరకు ఆదివారం ఎక్సైజ్ అధికారులు నిఘా వేశారు. రైల్వేస్టేషన్ థర్డ్ ప్లాట్‌ఫారం వైపు శివనగర్ ఆటో స్టాండ్ వద్ద పెద్ద బ్యాగులతో ఒడిశా రాష్ట్రం అదవగజపతి జిల్లా, అంటరాబా మండలం, కంటపడార్ గ్రామానికి చెందిన సంజయ్ నాయక్ అనుమానాస్పందంగా కనిపించారు. వెంటనే అతడి బ్యాగులు తనిఖీ చేయగా 10కేజీల ఎండు గంజాయి లభ్యమైందన్నారు. కాగా సంజయ్ నాయక్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. ఈతనిఖీల్లో ఎస్సై సరిత, రేష్మా, కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

వరంగల్ : గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లి గ్రామ సమీపంలోని ఓ కౌలు రైతు పత్తిచేను సమీపంలో చెట్ల మధ్య గుర్తు తెలియని మహిళ (45-50) కుళ్లిన మృతదేహం ఆదివారం లభించినట్లు ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు. సంఘటన స్థలాన్ని చేరుకొని, క్షుణ్ణంగా పరిశీలించి అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురిలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. సంబంధికులు మామునూర్ ఏసీపీ-87126 85238, ఏనుమాముల సీఐ-87126 85120 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

రిజిస్ట్రార్‌గా ఎవరికి అవకాశమో?

- 30వ తేదీతో ముగియనున్న ప్రస్తుత రిజిస్ట్రార్ పదవీ కాలం
- నేటి కేయూ పాలకమండలి సమావేశంలో నిర్ణయం?



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పలువురి ప్రొఫెసర్లలో ఎవరిని నియమిస్తారనే అంశం యూనివర్సిటీలో కొద్దిరోజులుగా చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత రిజిస్ట్రార్‌గా ఉన్న కేయూ దూరవిద్యకేంద్రం రిటైర్డ్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్‌రావు పదవీకాలం ఈ నెల 30వతేదీతో ముగియబోతోంది. మరోవైపు ఆయననే కొనసాగిస్తారనే విషయంపై కూడా గత కొద్దిరోజులుగా చర్చగా ఉంది.అయితే యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ గతంలో వివిధ విద్యార్థి సంఘాల జాక్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో ఆందోళనలు, దీక్షలు చేసిన విషయం విధితమే. ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. అంతేగాకుండా రిటైర్డ్ ప్రొఫెసర్‌ను ఎలా రిజిస్ట్రార్‌గా కొనసాగిస్తారని వివిధ విద్యార్థి సంఘాలు ప్రశ్నించాయి.

వీసీ రమేష్ తీరుపై విమర్శలు

రిజిస్ట్రార్‌గా శ్రీనివాస్‌రావును కొనసాగించడంపై వీసీ రమేష్ తీరుపై విమర్శలువచ్చాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏ ఏ శాఖల్లో రిటైర్డ్ ఉద్యోగులు, అధికారులు పనిచేస్తున్నారనే విషయంపై ప్రభుత్వం జాబితా తెప్పించుకున్న విషయం విధితమే. ఆ జాబితా ప్రకారం యూనివర్సిటీ అధికారులు పంపారా లేదా అనే విషయం సందిగ్ధంగా ఉంది. ఇదిలా ఉండగా వీసీ రమేష్‌కు మాత్రం ప్రస్తుత రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావునే కొనసాగించాలనే ఉంది. ఎందుకంటే ఈ ఏడాది మే 23వతేదీతో తన పదవీకాలం ముగియబోతుంది. అప్పటి వరకు శ్రీనివాస్‌రావునే కొనసాగించాలని వీసీ భావిస్తున్నట్లు సమాచారం. అయితే పలు ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న వీసీ.. ఇక మళ్లీ శ్రీనివాస్‌రావునే కొనసాగిస్తే మళ్లీ విమర్శలు ఎదుర్కోవాల్సింటుందని అనుకుంటున్నట్లు తెలిసింది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో పాలకమండలిలోఎక్స్ అఫీషియో మెంబర్లుగా అధికారులే ఉన్నారు. దీంతో రిటైర్డ్ ప్రొఫెసర్‌ను రిజిస్ట్రార్‌ను కొనసాగించేందుకు అధికారులు అంగీకరించే అవకాశం ఉండదు. అందుకే ఇక రెగ్యులర్ ప్రొఫెసర్‌ను రిజిస్ట్రార్‌గా నియమించేందుకు ప్రతిపాదించాలని వీసీ రమేష్ నిర్ణయించుకున్నట్లు చర్చగాఉంది.

రిజిస్ట్రార్ పదవిపై పలువురు విముఖత..

తనకు సన్నిహితంగా ఉండే కేయూ ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్, కామర్స్‌అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ నర్సింహాచారి వైపే వీసీ రమేష్ మొగ్గుచూపినట్లు సమాచారం.అయితే తనకంటే సీనియర్ ప్రొఫెసర్లు ఉన్న నేపథ్యంలో నర్సింహాచారి రిజిస్ట్రార్ పదవి పట్ల విముఖత చూపారని సమాచారం. అయితే ప్రొఫెసర్ టి యాదగిరిరావు, వాసుదేవరెడ్డి, ఆర్ మల్లికార్జున్‌రెడ్డి, టి మనోహర్,ఎస్‌జ్యోతి తోపాటు ఇంకా పలువురు ప్రొఫెసర్లు ఉన్నారు. వీరిలోఎవరికైనా అవకాశం ఇస్తారా లేదా అనే విషయం కూడా చర్చనీయాంశంగామారింది. వర్సిటీలో ఉన్న అనేక సమస్యల నేపథ్యంలో రిజిస్ట్రార్ పదవి పట్ల పలువురు విముఖత చూపుతున్నారని తెలుస్తోంది. సోమవారం హైదరాబాద్‌లో కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సమావేశం నిర్వహించనున్నారని సమాచారం.ఈ సమావేశం ఎజెండాలో వివిధ అంశాలతోపాటు రిజిస్ట్రార్ నియమాకంపై కూడా చర్చించి నిర్ణయించే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.

పాలకమండలి సమావేశం లేక రెండు నెలలు

కేయూ పాలకమండలి సమావేశం జరగక సుమారు రెండు నెలలు అవుతోంది. ఇప్పటికీ రెండు సార్లు తేదీలు ఇచ్చినా సమావేశం వాయిదాపడింది. ఈ క్రమంలో ఈ నెల 29న పాలకమండలి సమావేశం ఉందని తెలుస్తోంది. ఇది కూడా జరుగుతుందా లేదా అనే విషయంపై వేచి చూడాల్సిందే. పాలకమండలి సమావేశం ఎప్పుడు ఉంటుందనే విషయం గోప్యంగానే ఉంచుతున్నారు. మరోవైపు యూనివర్సిటీలోని పలు సమస్యలపై ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదులు కూడా వెళ్లాయి. ఫిర్యాదుల దృష్ట్యా ఒకవేళ పాలకమండలి సమావేశం జరిగితే ఆయా అంశాలు చర్చకు వస్తాయయని యూనివర్సిటీలో చర్చగాఉంది.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఐనవోలు మండలం పున్నేలులో వ్యక్తి, నర్సంపేట మండలం మహేశ్వరంలో మరో వ్యక్తి, ఖానాపురం మండల కేంద్రంలో మహిళ బలవన్మరణాలకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

ఐనవోలు : అప్పుల బాధ భరించలేక తీవ్ర మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పున్నేలు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం పున్నేలు గ్రామానికి చెందిన ఎండీ గౌస్‌మియా(48) తన కుటుంబ అవసరాల కోసం సొంత ఇంటిని ప్రైవేటు హోం ఫైనాన్స్‌లో మార్టిగేజ్ చేసి రుణం తీసుకున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించే వీరికి లోన్ తీర్చడానికి ఇబ్బందులు ఏర్పడగా ఎనిమిది నెలల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఇంటికి చేరుకోగా తన ఇంటి గోడలపై ఈ ఇళ్లు తాకట్టులో ఉంది ఎవరు కూడా లావాదేవీలు జరపకూడదని సదరు ఫైనాన్స్ దారులు రాయించడంతో పాటు ఇంటి ప్రధాన ద్వారానికి నోటీసులు అంటించి సీజ్ చేసి ఉండటంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. హైదరాబాద్ నుంచి వెంట తెచ్చుకున్న లగేజీని ఇంటిపై పెట్టి వస్తానని భార్యతో చెప్పి పైకి వెళ్లాడు. చాలా రోజుల నుంచి ఇంట్లో ఎవరు లేకపోవడంతో చుట్టూ చెత్తచెదారం ఉండడంతో గౌస్‌మియా భార్య శుభ్రం చేయసాగింది. భర్త ఎంతకు కిందికి రాకపోవడంతో ఏం చేస్తున్నాడని పైకి వెళ్లి చూడగా ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. దీనిపై ఎస్సై గైకాడి అనిల్ కుమార్‌ను వివరణ కోరగా ఫైనాన్స్ వారు డోర్‌కు నోటీసులు అంటించడంతో పాటు గోడపై రాసి ఉన్నట్లు తెలిపారు. మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మహేశ్వరంలో మేకప్ ఆర్టిస్ట్ ..



రవి మృతదేహం

నర్సంపేట రూరల్ : పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సంపేటలోని మహేశ్వరం గ్రామశివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన బోళ్ల రవి(45) హైదరాబాద్‌లోని ఫిలింనగర్‌లో మేకప్ ఆర్టిస్ట్‌గా పని చేస్తున్నాడు. కాగా నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన భాగ్యతో వివాహం కాగా ఇద్దరు కుమారులు జన్మించారు. ప్రస్తుతం హైదరాబాద్ ఫిలింనగర్‌లోనే ఉంటారు. ఆదివారం ఉదయం మహేశ్వరం శివారులోని వ్యవసాయ భూముల వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి కనిపించడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. నర్సంపేట ఎస్సై శీలం రవి ఘటన స్థలా నికి చేరుకోని మృతిపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేటకు తరలించారు. మృతికి సంబంధించిన వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. ఎస్సై రవిని వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు చేస్తే వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ..

ఖానాపురం : ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పూజిత(35) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు అధికమవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇదే విషయంపై ఎస్సై మాధవ్‌ను వివరణ కోరగా మృతి చెందిన విషయం వాస్తవమేనని, వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

కాల్వలో పడి బాలుడి మృతి



మన్వీత్ (ఫైల్)

వెంకటాపురం(కె) : మండలంలోని ఒంటిమామిడి గ్రామ సమీపంలో గల పాలెం ప్రాజెక్టు కాల్వలో పడి ఓ బాలుడు మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఒంటిమామిడి గ్రామానికి చెందిన శ్యామల రామకృష్ణ-రాధల చిన్న కుమారుడు మన్వీత్(2) ఆదివారం స్థానిక చిన్నారులతో కలిసి ఆడుకుంటున్నాడని తెలిపారు. ఈక్రమంలోనే సమీపంలోని పాలెం ప్రాజెక్టు కాల్వ వద్దకు రోడ్డు దాటి వెళ్లాడు. ప్రమాదవశాత్తు ప్రాజెక్టు కాల్వలో జారిపడి మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. కాగా బాలుడి కోసం తల్లిదండ్రులు గ్రామంలో వెతకగా ఆచూకీ లేకపోవడంతో ఆందోళన పడ్డారు. అనంతరం ప్రాజెక్టు కాల్వలో వెతకగా బాలుడి మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. కాగా సంఘటన విషయం తెలుసుకున్న వెంకటాపురం ఎస్సై అశోక్ గ్రామానికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు.